క్లుప్తంగా

పౌష్టికాహార లోపం గల పిల్లలను గుర్తించాలి



చాట్రాయి: పౌష్టికాహార లోపం గల చిన్నారులను గుర్తించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందికి ఎంపీడీవో దుర్గాప్రసాదు సూచించారు. మండలంలోని తుమ్మగూడెం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 5 ఏళ్లలోపు పిల్లల్లో వయస్సుకు తగిన బరువు, ఎత్తు లేని పిల్లలను గుర్తించి తగిన నివేదిక ఇవ్వాలని ఆయన అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం చిన్నారులకు మెరుగైన పౌష్టికాహారం అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రింగ్‌సెంటర్‌లో ఆక్రమణల తొలగింపు



ఇబ్రహీంపట్నం: స్థానిక రింగ్ సెంటర్‌లో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను స్థానిక పోలీసులు శుక్రవారం తొలగించారు. రింగ్ సెంటర్ నుంచి హైదరాబాద్, భద్రాచలం, విజయవాడ తదితర ప్రాంతాలకు నిత్యం ప్రయాణికులు వెళ్తుంటారు. వ్యాపారులు ఆక్రమణలతో ఫుట్‌పాత్‌లు కుదించుకుపోయి ప్రయాణికులు రోడ్లపై ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో నిత్యం భారీగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. ప్రయాణికుల ఫిర్యాదుతో సీఐ పి.శ్రీను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో ఆక్రమణలు తొలగించారు. మళ్లీ ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


పాల రైతులకు బోనస్ పంపిణీ

కొత్తగూడెం(మైలవరం): మైలవరం మండలం కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సహాయ సహకార సంఘంలో 250 మంది పాల రైతులకు రూ.2078.60 ధర వ్యత్యాసంను బోనస్ కింద శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుల్లూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చిలుకూరు రామిరెడ్డి మాట్లాడుతూ ఉచిత క్షీర బంధు, గడ్డికణుపులు, కల్యాణ మస్తు పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ఏప్రిల్ నుంచి జూలై వరకు ఎక్కువగా పాలు పోసిన పల్లెపోగు నాగేశుకు రూ.19,985, భీమవరపు ముత్తారెడ్డికి రూ.8,876, గరికపాటి మరియదాసుకు రూ.7,878 బోనస్ లభించింది. కార్యక్రమంలో కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అప్పిడి సాంబిరెడ్డి, సూపర్‌వైజర్‌లు, పాలకవర్గ సభ్యులు, వేతన కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలకు నమోదు చేసుకోండి

గంపలగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఐదు రకాల ఆటల పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ ఎంట్రీలను గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి శుక్రవారం తెలిపారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో పోటీలను వివిధ స్థాయిల్లో అక్టోబర్ 2వ తేదీ నుంచి నిర్వహిస్తారన్నారు. 17 సంవత్సరాల వయస్సు పైబడి ఉన్న క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. పోటీలు గ్రామ సచివాలయ స్థాయిలో 8 రోజులు, మండల స్థాయిలో 12 రోజులు, నియోజకవర్గ స్థాయిలో 6 రోజులు, రాష్ట్ర స్థాయిలో 5 రోజులు మొత్తం 38 రోజులు జరుగుతాయన్నారు.

తిరుపతమ్మ ఆలయానికి కంప్యూటర్లు బహూకరణ



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి శుక్రవారం మండలంలోని అనిగండ్లపాడు గ్రామ కెనరా బ్యాంక్ వారు రూ.2 లక్షల విలువ చేసే కంప్యూటర్లను ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు బ్యాంక్ అధికారులు, సిబ్బందిని అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

వివాహిత అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీకి చెందిన నేమాల భవాని, శ్రీను భార్యాభర్తలు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. చిన్న కుమార్తె నరహరి స్వర్ణలతకు మూడేళ్ల కిందట గుంటూరుకు చెందిన రాఘవేంద్రరాజుకు ఇచ్చి వివాహం జరిపించారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా స్వర్ణలత పుట్టింటికి వచ్చేసింది. స్వర్ణలత నివాసం ఉండే బ్లాక్‌లో ఉండే అజయ్, అతని భార్యతో పరిచయం అయింది. ఈనెల 24వ తేదీ సాయంత్రం 8 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిన స్వర్ణలత కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల ఆరా తీయగా అజయ్ కూడా కనిపించడం లేదు. దీంతో తన కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

తిరువూరు: శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను తిరువూరు పట్టణంలో మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీచంద్రమౌళీశ్వరాలయం, శ్రీఅష్టలక్ష్మీ ఆలయం, పీటీకొత్తూరు రామాలయం, రాజుపేట శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం, కోదండ రామాలయాలలో సామూహిక కుంకుమార్చనల్లో మహిళలు పాల్గొన్నారు. వరలక్ష్మీ వ్రతాన్ని సంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు.

గంపలగూడెంలో...

గంపలగూడెం: శ్రావణమాసం రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలు వరలక్ష్మీదేవికి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గంపలగూడెంలో గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం జరిపారు. అనంతరం నూతన వస్త్రాలు, వివిధ రకాల గాజులతో ప్రత్యేక అలంకరణ చేసి, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవాకమిటీ ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు.



తిరువూరు శ్రీఅష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి విశేషాలంకారం



విస్సన్నపేటలో మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు



గంపలగూడెంలో ముత్యాలమ్మకు గాజులతో అలంకరణ

మహాలక్ష్మీదేవిగా అమ్మవారి అలంకారం

విస్సన్నపేట: స్థానిక కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని మహాలక్ష్మీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా మండలంలో మహిళలు వరలక్ష్మీ వ్రతాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మైలవరం నియోజకవర్గానికి చెందిన కాంద్రకొండ గురవయ్య నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించిన నూతన కమిటీలో ఆయనకు చోటు దక్కింది. ఈ సందర్భంగా గురవయ్య శుక్రవారం గొల్లపూడిలో మైలవరం నియోజకవర్గ శాసనసభ్యుడు వసంత వెంకట కృష్ణప్రసాద్ కార్యాలయానికి వెళ్లి ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గురవయ్యకు శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయటంలో ఎస్సీలందరూ ఆయనకు అండగా నిలబడాలన్నారు. గురవయ్య జిల్లా పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసి 2010లో పదవీ విరమణ చేసిన తరువాత వైఎస్సార్ సీపీలో చేరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా, అనంతరం రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని గురవయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.



గురవయ్యను అభినందిస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

పెనుగొలనులో సురవరం, చింతా దీక్షితుల వర్ధంతి

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలను గ్రామంలో స్వచ్ఛంద సంస్థ షిర్డీసాయి బాబా సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రముఖ కవులు సురవరం ప్రతాపరెడ్డి, చింతా దీక్షితుల వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఇరువురు కవులు తెలుగుసాహితీ రంగంలో చేసిన సేవల్ని కొనియాడారు.

ఎమ్మెల్యే వసంతను కలిసిన కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్

మైలవరం: టీవల కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్‌గా నూతనంగా నియమితులైన తాతినేని పద్మావతి శుక్రవారం మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను గొల్లపూడిలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యాల మేరకు ప్రజలకు విస్తృతంగా సేవలను అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేడీసీసీబీ డైరెక్టర్ గుమ్మడపు రవీంద్రరాణా పాల్గొన్నారు.

ఆస్తి కోసం రెండో వివాహం చేసుకోమంటున్నారు

మేనమామపై బాధితురాలి ఫిర్యాదు

జగ్గయ్యపేటఅర్బన్: ఆస్తి కాజేయాలనే కుట్రతో రెండవ వివాహం చేసుకోవాలని బలవంతం చేస్తున్న శరణం మురళీకృష్ణ, వారికి సహకరించిన ఇతర బంధువులపై జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫిర్యాదుదారు నందనమూడి భావన సాయి చెప్పిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తన తండ్రి నందనమూడి రవి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ పెద్ద ఎత్తున ఆదాయాన్ని సమకూర్చుకోగలిగారని, 2021లో ఆయన కరోనాతో మరణించారని తెలిపారు. ఆ తరువాత తన తండ్రికి చెందిన ఆస్తుల సమాచారం తెలుసుకుని మేనమామ మురళీకృష్ణ తమ ఆస్తులను కాజేయాలనే కుట్రతో తనను బెదిరించి ఇప్పటికే కోట్లాది రూపాయల విలువ చేసే ఆస్తులను, నగలను, నగదును స్వాహా చేశారని తెలిపారు. మిగిలిన ఆస్తులు కూడా తనకే దక్కాలనే ఆశతో గత కొన్ని నెలలుగా తనను చిత్రహింసలకు గురి చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన మేనమామ మురళీకృష్ణకు వివాహమై ఇద్దరు పిల్లలు కలిగి ఉన్నప్పటికీ తన ఆస్తి కోసం తనను రెండవ వివాహం చేసుకోవాలని బలవంతం చేస్తున్నాడని ఆమె ఆరోపించారు. మేనమామ మురళీకృష్ణకు తమ తాతగారైన శివయ్య, అమ్మమ్మ పద్మావతి, రాజేశ్వరి, తోట రామారావు, ఉమా మహేశ్వరి సహకారం అందించి తనను తీవ్ర ఇబ్బందులను గురి చేస్తున్నారని తెలిపారు. వరంగల్ యూనివర్సిటీలో పరీక్షలు రాస్తున్న తనను పేట మండలంలోని షేర్‌మహ్మద్‌పేట గ్రామానికి తీసుకువచ్చి గృహంలో నిర్బంధించి చిత్రహింసలకు గురిచేసి చంపేందుకు ప్రయత్నం చేయగా పారిపోయి జగ్గయ్యపేటలోని తన బాబాయి మధు ఇంటికి చేరుకుని ప్రాణాలను కాపాడుకోగలిగానని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ బీవీ రామారావు తెలిపారు.

బీపీ మండల్ చిరస్మరణీయుడు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): బీసీలకు రిజర్వేషన్లు కల్పించటంలో విశేష కృషి చేసిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వర్ ప్రసాద్ మండల్ (బీపీ మండల్) చిరస్మరణీయుడని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు అన్నారు. బీపీ మండల్ జయంతిని పురస్కరించుకుని అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యాధరపురంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాల సర్వీస్‌లో 27 శాతం రిజర్వేషన్ కల్పించిన మహానుబావుడు బీపీ మండల్ అన్నారు. దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీల కోసం 11 రకాల జీవన ప్రమాణాలను కొలమానంగా తీసుకుని సుమారు మూడు వేలకుపైగా కులాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదికను అందించిన వ్యక్తి బీపీ మండల్ అన్నారు. దానిని అమలు చేసేందుకు ఆయన చేసిన ప్రయత్నాల్లో అనేక అవరోధాలు కలిగాయని పేర్కొన్నారు. చివరికి కేంద్ర, రాష్ట్ర విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు సాధించటనికి మూలకారకుడు బీపీ మండల్ అని వివరించారు. బీసీల అభ్యున్నతికి విలువైన సూచనలు చేసిన బీపీ మండల్ దేశంలోని బీసీలందరి మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ నాయకులు మాదల తిరుపతిరావు, ఎస్వీ యశోద, అంకాని నాగరాజు, పిచ్చుక లింగారావు, టి.పూర్ణయ్య, అమృత, ఎ.పార్వతి, టి.ప్రమీల, జి.రంగమ్మ పాల్గొన్నారు.



బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శేషగిరిరావు తదితరులు

మైనార్టీ అధికారిపై వ్యాఖ్యలు దుర్మార్గం

జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్

వించిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్ర వక్ఫ్‌బోర్డు స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మైనార్టీ మహిళ ఐపీఎస్ అధికారిని షిరీన్‌బేగంపై అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న టీడీపీ ఏజెంట్ ఫారుక్ షుబ్లీ అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఫోర్‌మెన్ బంగ్లా, ఎర్రకట్ట వద్ద అక్బరీ మసీదులో ప్రార్థనల అనంతరం గౌస్‌మొహిద్దీన్ విలేకర్లతో మాట్లాడారు. గత టీడీపీ హయాంలో వక్ఫ్ బోర్డును అవినీతి మయం చేసి వేలాది ఎకరాలు అన్యాక్రాంతం చేసిన టీడీపీ నాయకులు ముస్లింలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర వక్ఫ్ బోర్డును ప్రక్షాళన చేసి, షిరీన్‌బేగం వంటి సమర్థులైన అధికారులతో వక్ఫ్ ఆస్తులను ఆక్రమణదారుల చెర నుంచి విడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల నంద్యాలలో విలువైన వక్ఫ్ ఆస్తులను ఆక్రమణదారుల చెర నుంచి విడిపించి సమర్థురాలైన అధికారిగా షిరీన్ బేగం తనను తాను నిరూపించుకుని అందరి ప్రశంసలు అందుకున్నారని పేర్కొన్నారు. గురువారం కోర్టు ఉత్తర్వులు అందే సమయానికి ఆవిడ విధుల నుంచి వెళ్లిపోయారని, దానిని వక్రీకరిస్తూ కోర్టు ధిక్కారం అంటూ షుబ్లీ డ్రామాలు ఆడుతూ అవినీతిపరుల కొమ్ముకాస్తున్నాడని ధ్వజమెత్తారు. తన స్వప్రయోజనాల కోసం అటువంటి అధికారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఫారుక్ షుబ్లీ మైనారిటీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ 55వ డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ సలీం, జిల్లా కార్యవర్గసభ్యులు బడేమియా, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ యూనిస్, ఖుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో బీసీ సంఘ ప్రతినిధులు

మహిళా అధికారిపై ఆరోపణలు సరికాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నిజాయతీ గల అధికారిపై అవినీతి ఆరోపణలు చేయడం సరికాదని బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్వీ రావు పేర్కొన్నారు. కేఎల్‌రావునగర్‌లోని బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎన్వీ రావు మాట్లాడుతూ నిజాయితీ కలిగిన అధికారిని షిరిన్ బేగంపై కొంత మంది వ్యక్తులు కావాలని అసత్య ప్రచారాలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మైనార్టీ హక్కుల సంఘం పేరిట మైనార్టీ మహిళను ఇబ్బందులకు గురి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీసీ మహిళైన షిరిన్ బేగంను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నామని పేర్కొన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి నమ్మి అప్పారావు, బాయన శేఖర్‌బాబు, బీసీ సంఘ సభ్యులు శంషాద్‌బేగం, షేక్. సాధిక, షేక్. షకీలా , పర్వీన్ తదిరులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ సేకరణకు నష్టపరిహారం చెల్లించాలి

మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ వినతి

మైలవరం: అమరావతి-నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూ సేకరణ నిమిత్తం భూములు ఇచ్చిన రైతులకు సరైన క్రమపద్ధతిలో నష్టపరిహారం చెల్లించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. విజయవాడలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ హాలులో శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం జరిగింది. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే మార్గంలోని ఆయా గ్రామాల ప్రజల అవసరార్థం సర్వీస్ రోడ్లు నిర్మించాలని కోరారు. జి.కొండూరు గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్‌హైవే నిమిత్తం ఎకరానికి రూ.59 లక్షలు నష్టపరిహారం ఇస్తున్నారని, దీనికి పక్కనే ఆనుకుని ఉండే గడ్డమణుగు గ్రామంలో ఎకరాకు రూ.34 లక్షలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. సమావేశంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అధికారులు, సహచర ఎమ్మెల్యేలు, నేషనల్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

జుజ్జూరుకు తరలివచ్చిన అధికారులు

జుజ్జూరు(వీరులపాడు): వీరులపాడు నుంచి మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మారుస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయటంతో శుక్రవారం మండల అధికారులు గ్రామానికి వచ్చారు. దీంతో గ్రామస్తులు, ఆయా పార్టీల నాయకులు స్వాగతం పలికారు. వేద పండితులు మంత్రోచ్ఛరణలతో అధికారులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని జెల్లి ఏసోబు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాల్లో తహసీల్దార్ ఆశయ్య నాయక్, ఎంపీడీవో అరుంధతీ దేవిలు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్వమతప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి వైఎస్సార్ సీఈపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, ఎంపీటీసీ సభ్యురాలు తమ్మిశెట్టి వరలక్ష్మి పాల్గొన్నారు.



జుజ్జూరులో బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆశయ్యనాయక్

ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం

- రెండు, మూడు నెలల్లో పూర్తి స్థాయిలో కార్యాలయాలు
- 30 ఏళ్లలో టీడీపీ చేసిందేమీ లేదు..
- మండల కేంద్ర మార్పును ప్రతి ఒక్కరూ స్వాగతించాలి
- కార్యాలయాల ప్రారంభంలో ఎమ్మెల్సీ అరుణకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

జుజ్జూరు(వీరులపాడు): ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నెరవేరుస్తున్నామని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. జుజ్జూరులో కొత్తగా ఏర్పాటు చేసిన మండల ప్రభుత్వ కార్యాలయాలను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. అరుణకుమార్ మాట్లాడుతూ రెండు, మూడు నెలల్లో అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాలు జుజ్జూరు గ్రామంలో ఏర్పాటుచేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యేగా డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జుజ్జూరుతో పాటు మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మూడు దశాబ్దాలుగా టీడీపీ జుజ్జూరు గ్రామానికి చేసిందేమీ లేదని అరుణ కుమార్ దుయ్యబట్టారు. మంచి చేసేందుకు మేం తాపత్రయపడుతుంటే చేస్తున్న మంచిని అడ్డుకునేందుకు టీడీపీ శతవిధాల కుటిల యత్నాలు చేస్తోందని మండిపడ్డారు. ప్రతిపక్షాలు అభివృద్ధిని కోరుతూ అధికార పక్షంపై పోరాడాలని కానీ నందిగామలో మాత్రం ప్రతిపక్ష పార్టీ భిన్నంగా వ్యవహరిస్తూ న్యాయ స్థానాలను ఆశ్రయించి మరీ అభివృద్ధిని అడ్డుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఒక గ్రామం ఎక్కువ మరోటి తక్కువ అనే భేదాలు లేవని నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు సమానమేనని అరుణకుమార్ తెలిపారు. ప్రజా సౌకర్యార్థమే మండల కేంద్రాన్ని మార్చామనే విషయాన్ని గమనించాలని కోరారు. ప్రజా నాయకుడు వట్టికొండ చంద్రమోహన్ గత ఎన్నికల్లో తమకు అండగా నిలిచారని మండల కేంద్ర మార్పులో కూడా అండగా ఉండాలని ఆకాంక్షించారు. అన్ని గ్రామాల ప్రజలు పెద్ద మనసుతో మండల కేంద్ర మార్పును స్వాగతించాలని ఆయన ఆకాంక్షించారు. వీరులపాడు మండల కేంద్రాన్ని జుజ్జూరు మార్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్సీ అరుణకుమార్‌ను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయి బాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ షేక్ నాగుల్ మీరా, ఎంపీటీసీ సభ్యురాలు తమ్మిశెట్టి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మూడున్నర దశాబ్దాల్లో చేయలేని మండల మార్పును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్‌లు మూడున్నరేళ్లలో చేసి చూపించారని ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు పేర్కొన్నారు.

దోమల నివారణ చర్యలు

విస్సన్నపేట: గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యలు చేపట్టామని సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి తెలిపారు. గ్రామంలో అన్ని వీధుల్లో ఫాగింగ్ మిషన్ ద్వారా దోమలు నివారిస్తామన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, ఉపసర్పంచ్ మందపాటి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, నాయకులు కోటేశ్వరరావు, పుల్లారావు, దుర్గాప్రసాద్, వైద్య ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

పుట్రేలలో...

మండలంలోని పుట్రేల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణకు శుక్రవారం దోమలమందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కారుమంచి స్వాతి, ఎంపీటీసీ గార్లపాటి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ ఎం వెంకటేశ్వరరెడ్డి ,ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

28న సీజ్ చేసిన వాహనాల వేలం

మైలవరం: మైలవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలోని ఎక్సయిజ్ కేసులలో సీజ్ చేసిన రెండు వాహనాలను ఈ నెల 28వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ప్రాంగణంలో వేలం వేయనున్నట్లు ఎస్‌ఈబీ సీఐ గిరిజ సత్యకుమారి శుక్రవారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు పాడుకున్న నగదుకు అదనంగా 18 శాతం జీఎస్‌టీ కట్టవలసి ఉంటుందన్నారు. ఈఎమ్‌డీ ద్విచక్ర వాహనానికి రూ.5వేలు, ఫోర్ వీలర్స్‌కు రూ.10వేలు చొప్పున చెల్లించాల్సిందిగా తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నంబర్‌లు 94409 02459, 88977 70007, 9492481841 ను సంప్రదించాల్సిందిగా తెలిపారు.

భర్త అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వించిపేటకు చెందిన షేక్. ముంతాజ్, ఆసీఫ్ భార్యాభర్తలు. ఆసీఫ్‌కు మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో వైద్యం చేయిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం భార్యాభర్తలిద్దరు బయటకు వెళ్లి వచ్చారు. ముంతాజ్ ఇంటి తలుపులు తీసిన అనంతరం భర్త కోసం చూడగా కనిపించలేదు. ముంతాజ్ ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.